# పరమార్థం

కె. వీణారెడ్డి

నిద్ర పట్టక అటూఇటూ దొర్లుతున్న అహల్య దృష్టి ఎదురుగానున్న గోడపై నిలిచింది. నీలం రంగు డి స్టెంపర్ గోడకు తగిలించిన పటంలో... పాలు పితుకుతున్న యశోదమ్మ కొంగు పట్టుకున్న వెన్నదొంగ చిలిపి చూపులు... యశోదమ్మ మొహంలో వేయి జ్యోత్స్నలు...కళ్ళలో కురుస్తున్న మాతృత్వపు మమకారపు జల్లులు!

అహల్య కళ్ళు నిండుకున్నాయి. మనసు భారమైంది. ముప్పయ్యో పడిలో పడుతున్నా,తను తల్లి కాలేకపోయింది. అయ్యో అవకాశంకూడా లేదన్నా డు డాక్టరు.

ఎందరు దేవుళ్ళున్నా, బాంక్ బాలెన్స్ ఎంతున్నా నట్టింట పిల్లలు నడయాడని ఇల్లూ ఓ ఇల్లేనా?

కడుపు పండని తన దురదృష్టానికి చింతిస్తూ, గొడ్రాలని ఈసడించే లోకానికి తలొంచి తానెందుకు ఒంటరి బతుకు నీడ్వాలి? తానెందుకు తల్లి కాకూడదు యశోదలా?

కన్నయ్యను కన్నతల్లి యశోద కాకున్నా...కాదనలే రెవ్వరూ! ఆమె మాతృత్వానికి ప్రతీక. యశోదా-కృష్ణుల అనుబంధం జగద్విదితమైన బంధం కాదా? యశోద కడుపున కృష్ణుడు పుట్టలేదన్న మాట కక్కడ తావేదీ?

"ఏమండీ?"

మాగన్నుగా నిద్రిస్తున్న భర్త జగన్నాథరావు కళ్ళు తెరిచాడు.

"మనం ఎవర్నైనా పెంపకానికి తీసుకుందామండీ!"

"తప్పకుండా,అహల్యా! ఆ మాటెప్పుడో చెప్పాలనుకున్నా, కానీ,నీ నోటి నుండే ఆ మాట కోసం ఎదురు చూస్తున్నా!"మృదువుగా భార్య చేతిని నిమురుతూ అన్నా డాయన.

"అందు కెవరైతే బాగుంటుంది?"

"అనాథ శరణాలయానికెళ్ళి చూద్దాం,అహల్యా నీకు నచ్చిన పాపను గాని, బాబుని గాని తెచ్చుకుందువు గాని!"

"ఊ... హూ! అనాధశిశువునా? నా మనసొప్పటం లేదండీ!"

"మరి?"

"మా చెల్లెలి మూడో అబ్బాయి రేవంత్ లేడూ? వాణ్ణి పెంచుకుందాం. ఆ ఆస్తి అంతస్తూ అయిన వాళ్ళకే దక్కుతుందన్న సంతృప్తి ఉంటుంది. రక్తసంబంధం, బాంధవ్యం వల్ల బాబుకి మన పట్ల ఆప్యాయతా ఉంటుంది!"

మరేం మాట్లాడ లే దాయన.

"నీ ఇష్టం,అహల్యా! ఎలాగైనా నీ మనోవ్యథ తగ్గటమే నా క్కావాలి సుమండి!"

భర్త ఒప్పుకోవటంతో తేలిగ్గా ఊపిరి పీల్చుకుంది అహల్య.



రేవంత్‌ని పెంపకాని కివ్వటంలో నీ ఉద్దేశ్య మేమిటి? అని చెల్లె ల్నడిగే అవసరం రాకుండానే "అక్కా! రేవంత్‌కి నువ్వంటే భలే అభిమానం. అస్తమానం నీ కబుర్లే! పెద్దమ్మ నన్ను ఎంతో



ముద్దు చేస్తుందని గొప్పగా చెప్పుకుంటూ మురిసిపోతాడు. నీ క్కూడా వాడంటే ఎంతో ఇష్టంకదా

ఈ సారి వాణ్ణిక్కడే వదిలేసి వెళతాను. కొన్నాళ్ళు నీ క్కూడా కాలక్షేపంగా ఉంటుంది!"

చుట్టపు చూపుగా వచ్చిన చెల్లెలు శరణ్య మాటలకు రోగి కోరిందీ, వైద్యుడు చెప్పిందీ ఒకటే నన్నట్లుగా తోచింది అహల్యకు. ఆమెలో సంతోషం తొంగి చూసింది.

"అలాగే, శరణ్యా! వాడు నాకు మాలిమి కావటం కంటే నా కింకేం కావాలి?"

రేవంత్‌ను దగ్గరకు తీసుకుంటూ మనస్ఫూర్తిగా నవ్వింది.

******

రేవంత్‌కు ఆ ఇంట్లో ఏ లోటూ లేదు. మళ్ళీ చెప్పాలంటే మకుటంలేని మహారాజులా పెరుగుతున్నా డనొచ్చు.

తలిదండ్రులమీద బెంగ పెట్టుకోకూడదని అస్తమానం వాడి నంటి పెట్టుకొనే ఉండేది అహల్య. కార్లో వాణ్ణి తీసుకెళ్ళి కోరినవీ, కోరనవీ...ఎన్నెన్నో దుస్తులు,బొమ్మలు, ఆట వస్తువులూ కొని పెట్టేది.

సెలవు లయ్యాక స్కూల్లోకూడా వేయించింది. రెండు పూట్లా కార్లో దింపే ఏర్పాటు చేయించింది.

"పెద్దమ్మా!" అంటూ పిలిచే బాబుతో-

"అమ్మా! అనే పిలూ,బాబూ!" ఆప్యాయంగా చూస్తూ అనేది.

"అమ్మా? మా అమ్మ ఊళ్ళో ఉందిగా!" అనే బాబు మాటతో అహల్య అంతరాంతరాల్లో ఏదో బాధ కలుక్కుమనేది. అంతలోనే సర్దుకునేది. కాలక్రమేణా వాడికే అన్నీ అర్థమవుతా యనుకునేది.

"అమ్మలాగే నన్నుకూడా 'అమ్మా' అని, పెదనాన్నని 'నాన్నా' అని పిలవటం అలవాటు చేసుకోవాలి,నాన్నా!" అనునయంగా చెప్పేది.

బొమ్మల ఆటలో మునిగిపోయిన బాబు ముచ్చటగా తలూపుతుంటే మురిసిపోయేది అహల్య.

******

అనుకోకుండా రేవంత్‌కి జ్వరం తగిలింది. కంగారు పడిపోయింది అహల్య. అనుక్షణం వాడి మంచం చుట్టే తిరుగుతుండేది. డాక్టర్- "మరేం ఫర్వాలేదు. మామూలు జ్వరమే" అన్నా మనసు కుదుట పడటం లే దామెకు.

"నీది మరీ అపురూపం,అహల్యా! పిల్ల లన్నాక కాస్త ఒళ్ళు వెచ్చబడకుండా ఉంటుందా?"

తేలిగ్గా అంటున్న భర్త మాటల్ని తేలిగ్గానే తీసుకుం దామె. చెల్లెల్నీ,మరిదినీ రమ్మని కబురు పెట్టింది. వెంటనే పరుగెత్తు కొచ్చారు చెల్లెలూ, ఆమె భర్తా

జ్వరంతో నున్న కొడుకు మంచం దగగర కూర్చుని చెల్లెలు కళ్ళనీళ్ళు పెట్టుకుంటుంటే చేయని నేర మేదో మీద పడ్డట్టుగా ఒక్క క్షణం ఫీలయ్యిం దామె.

అన్ని సపర్యలూ తానే చేస్తూ తన ప్రమేయం లేకయే బాబు మంచి చెడ్డలు చూసుకుంటున్న చెల్లెల్తో ఏదీ చెప్పలేక, ఏమీ చేయలేక నిస్సహాయంగా చూస్తూండి పోయేది. మనసులో ఏదో బాధగా ఉన్నా, 'తల్లి ప్రేమ కదా' అన్న భావంతో తన అభిప్రాయాన్ని, అభిమానాన్ని తనలోనే దాచుకునేది అహల్య.

జ్వరం తగ్గి పథ్యం పెట్టాక"అక్కా! బాబు జాగ్రత్త!" అంటూ పిల్లల పెంపకాన్ని గూర్చి బోధిస్తూ వెళ్ళిపోయింది చెల్లెలు.

'తల్లినీ, బిడ్డనీ తను వేరు చేయటం లేదు కదా!' అని క్రుంగిపోయిం దొక్క త్రుటి కాలం.

******

"బాబూ! తప్పు కదూ? రంగ న్నలా 'ఒరేయ్' అనొచ్చా? పెద్దవాడు కాదూ?"మందలింపుగా అం దోనాడు అహల్య.

"రంగన్న పెద్ద వాడేంటి, పెద్దమ్మా? సారీ... అమ్మా! మనమే అన్నింట్లో పెద్దవాళ్ళం. రంగన్న మనింటి నౌఖరు? ఒరేయ్ అంటే తప్పేంటి?"రేవంత్ గర్వంగా అంటుంటే వింతగా చూసింది. వీ డప్పుడే అంత పెద్ద వాడయ్యాడా? ఈ ఇంటి ఆస్తి, అంతస్తులూ, తన గారాబం... తిరుగులేని తనం వీ డి కిన్ని మాటలు నేర్పాయా?

నయానా చెప్పి చూసింది. నిర్లక్ష్యంగా కొట్టి పారేశాడు. భయానా చెప్పి చూసింది. బిత్తర పోయాడు రేవంత్. పల్లెత్తు మాటైనా అనని పెద్దమ్మ రంగన్న విషయంలో కోప్పడేసరికి కోపం, ఉక్రోషం తలెత్తాయి రేవంత్‌లో.

"నౌకరు వెధవల్ని నెత్తిన పెట్టుకో నువ్వే! నాకు మాత్రం చెప్పకు!"విసురుగా అన్నాడు.

"రేవంత్!" గర్జించింది అహల్య.అంత సేపూ తెచ్చి పెట్టుకున్న సహనం వాడి పొగరుమోతు సమాధానంతో నశించి పోగా రేవంత్ చెంపపై ఛెళ్ళు మన్పించింది."నోటి కెంతొస్తే అంత మాట నేయటమే! ఏదో పసితనం పోనీ లెమ్మని కిమ్మనక పోవటం నాదే తప్పురా! గారం చేసినందుకు నా నెత్తిమీద కెక్కాలని చూస్తున్నావ్. నువ్వు చేసే ఆగడాలు సహించలే నింకా. మొక్కై వంగనిది మానై వంగదని ఊర్కే అన్నారా! ఇహనుండీ చెప్పినట్టు వినక పోయావో, ఎదురు మాటన్నావో ఊరుకునేది లేదు!" కఠినంగా అంటూ వెళ్ళి పోయిం దక్కణ్ణుంచి.

ఎప్పుడూ లాలించి బుజ్జగించే పెద్దమ్మల్లో పెల్లుబికిన కోపానికి జడిసిపోయే బదులు రేవంత్‌లో రెట్టింపుగా ఆవేశం, మొండితనం చోటు చేసుకున్నాయి.

"నేను మా అమ్మా,నాన్న దగ్గర కెళ్ళిపోతాను. నన్ను పంపించెయ్, పెద్దమ్మా!"గదిలో కొచ్చి కన్నీళ్ళతో విసురుగా అంటున్న రేవంత్ మాటలకు విస్తుబోయింది అహల్య. ఏడేళ్ళ వాడిలో ఎనలేని పౌరుషం."ఎందుకని,బాబూ?"

"నువ్వు నన్నుకొట్టావ్!నేన్నీదగ్గ రుండను!"

"తప్పు చేస్తే అమ్మ కొట్టదా,బాబూ?"అనునయంగా వాణ్ణి దగ్గరకు తీసుకుని వాడి తల నిమురుతూ అంది అహల్య.

"అమ్మ కాదుగా నన్ను కొట్టింది. నువ్వు!"

"బాబూ!"వాణ్ణి చుట్టిన చేతుల పట్టు సడలింది. నవనాడులూ కుంగిపోయినట్టుగా తోచిందామెకు.

ప్రస్ఫుడిపోయి అలా ఎంత సేపో కూర్చున్న అహల్య భర్త రావటం గమనించి సర్దుకుంది.

వాడికే తెలుసు? ఏదో పసితనం,అమాయకత్వం. ఇహనుండీ తన పెంపకంలో మంచివాడుగా, బుద్ధిశాలిగా తయారవ్వాలి ముమ్ముందు. అందుకు తను శాయశక్తులా కృషి చేయాలి! అలా అనుకోవడంతో ఏదో రిలీఫ్ కలిగి మనసులోని బాధ, వ్యధ మాయమయ్యా యామెలో.

"అలా ఉన్నావేం,అహల్యా?" అంటూ భర్త అడక్క ముందే ముఖ కవళికల్ని మార్చేస్తూ నవ్వుతూ చూసింది.

******

మరో రెండ్రోజుల్లో బాబు పుట్టిన్రోజు కావటంతో చెల్లెలి కుటుంబాన్ని పిల్చుకు రావడానికి బయల్దేరింది అహల్య.

మిట్ట మధ్యాహ్నానికి చెల్లె లిల్లు చేరుకుంది. వాకిలి ముందు కా రాపుజేసి మెల్లిగా ఇంట్లోకి నడిచింది.

'ఇంట్లో ఎవ్వరూ లేనట్టుందే!'అనుకుంటూ పెరట్లోకి వెళ్ళబోయింది.

అక్కణ్ణుండేవో మాటలు వినిపించడంతో ఆ మాటల్లో తన పేరుండటంతో సహజమైన కుతూహలంతో అక్కడే ఆగిపోయిం దామె ఆ వేపు చెవి

యొగ్గి.

"ఆ మహాతల్లి మహత్య మేమిటో గాని,వెళ్ళిన కొద్ది రోజులకే పిల్లాడికి జ్వరం సోకినప్పుడే నాకు భయం వేసిందే,అమ్మాయ్! గొడ్డు దాని చేతి పిల్లాడు గొడ్డుకన్నా హీన మవుతాడేమో నని బెంగగా ఉంది.ఎంతైనా కన్న ప్రేమ కాదుగా! ఎలా ఉన్నాడో? పిల్లాడెంత బెంగ టిల్లు తున్నాడో?" చెల్లెలు శరణ్యా అత్తగారి బాధ.

"పోన్లే,అత్తయ్యా! అవన్నీ మన మాలోచిస్తూ కూర్చుంటే ఎలా? గొడ్రాలైనా అక్క చేతికి బాబు నిచ్చిందెందుకంటావ్? ఆ 'స్తకోసం! మన పిల్లాడంత 'స్థతి మంతుడైతే ఇంక మనకేం కొదువ?"చెల్లెలి కంఠంలో కదలాడిన ఆశ.


"అద్సరే గా నమ్మాయ్!వాడు పూర్తిగా మనల్ని మర్చిపోతే ఎలా?"

"మరీ చిన్నపిల్లాడు కాదుగా, అత్తయ్యా! ఆవిడ కన్నతల్లి కాదని, తల్లి దండ్రులం తనవాళ్ళం ఇక్కడున్నామని వాడికి తెలుసు. ఎన్ని పెట్టినా, ఎంత చేసినా తల్లి దండ్రులు కాలేరు,మనకు సాటి రాలేరు వాడి దృష్టిలో వాళ్ళు. నాకా భయం లేదు!"

ఇంక వినలేకపోయింది అహల్య. దెబ్బతిన్న పక్షిలా విలవిల్లాడిం దామె హృదయం. వడివడిగా బయటికి నడిచింది. దిక్కు తోచని దాన్లా అటూ ఇటూ వచార్లు చేసింది.

ఎంతో సేపటిగ్గాని అతి ప్రయత్నంమీద మాములు మనిషి కాలేకపోయింది.

"రంగన్నా! ఆ పళ్ళ బుట్ట ఇలా పట్రా!" అంటూ కేకేసింది అటు రంగన్నకూ, ఇటు ఇంట్లోని వాళ్ళకూ వినిపించేలా.




******

భారీ ఎత్తున బాబు పుట్టినరోజు వేడుకలు జరిగయి. అంతా చూస్తున్న శరణ్యా కళ్ళు మెరిశాయి.

"అదృష్టవంతు డక్కా, బాబు! నీ వంటి గొప్పదాని, ఉత్తమురాలి చేతిలో పడ్డాడు ! వాడి కేం లోటు?" అంటున్న చెల్లెలి మాటలకు బదులుగా నవ్వింది అహల్య.

మర్నాడు వెళ్ళటాని కుద్యుక్తు లయ్యారంతా. చకచకా బాబుని ముస్తాబు చేసింది అహల్య. రెండు పెద్ద పెట్టెల్లో బాబుకి సంబంధించిన బట్టలు, బొమ్మలూ అన్నీ సర్ది కార్లో పెట్టించింది. అర్థం కానట్టు చూస్తున్నా రంతా.

వెళ్ళు,రేవంత్! అమ్మా నాన్నల దగ్గరకే వెళ్తానని మాటీ మాటికీ మారాం చేస్తావ్‌కదా! నీ ఇష్టం అలాగే వెళ్ళు, బాబూ!" అంటూ రేవంత్‌ను చేయి పట్టి తీసుకొచ్చి తల్లి దండ్రుల చెంత నిలిపింది.

"ఏమిటక్కా ఇదంతా?"హతాశురాలై అడిగింది శరణ్య.

"బాబు నా దగ్గర మాలిమి కావటం లేదు,శరణ్యా వాణ్ణి దార్లో పెట్టటం కూడా నా వల్ల కావటం లేదు. అన్ని అధికారాలతో పెట్టటానిక్కాని , కొట్టటానికిగ్గాని కన్నతల్లిని కాదుగా! బుద్ధెరిగిన కుర్రాడు. అమ్మెవరో,అన్యులెవరో తెల్సు వాడికి. తల్లి ఉండికూడా తల్లి కాలేని నా దగ్గర పెరగాల్సిన ఖర్మ వాడి కెందుకు? ఎవరి బిడ్డ వారి దగ్గరుండటమే శ్రేయస్కరం. అంత్య నిష్ఠురం కన్నా ఆది నిష్ఠురం మిన్న, శరణ్యా! నీ బిడ్డను నీవే తీసుకెళ్ళు!" తిరుగులేని నిర్ణయంగా చెబుతూ అక్కణ్ణుంచి వెళ్ళిపోయింది అహల్య.

******

అనాథ శరణాలయం వేపుగా కారు సాగిపోతోంది.

కులమతాల కతీతంగా తిరిగి, అందర్నీ అలరించి, అమ్మ పెట్టిన వెన్ననూ, పెట్టని మన్నునూ తిని, జీవిత పరమార్థాన్ని ఆ తల్లికి చూపిన చిన్ని క్రిష్ణయ్య కదలాడగా, వెనక చేరిన కొడుక్కి చేతిలో వెన్నముద్ద, మనసులో ఓ ముద్దు పెడుతూ, కవ్వంతో చల్ల చిలుకుతున్న నాటి యశోదమ్మ చల్లని తల్లి మనసులా మైమరచి పోయిందిఅహల్య. ★

నవజ్యోతి వారి సరికొత్త పుస్తకాలు!




మొగుడే కావాలా?-చందు సోంబాబు....రూ.20/-
సామ్రాట్ పృథ్వీరాజ్-శ్రీప్రసాద్..........రూ.20/-
క్షేత్రవతి-లల్లాదేవి....................రూ.20/-
నేటి రామాయణం-కోడూరి శారదాదేవి.....రూ.25/-
ప్రేమాలయం-పోలాప్రగడ రాజ్యలక్ష్మి.....రూ.18/-
సమువుకున్న మారాజులు
పోలాప్రగడ సత్యనారాయణ మూర్తి.....రూ.15/-
మధ్యతరగతి సెంటిమెంట్-అమర్ మోహన్...రూ.18/-

మీ దగ్గర బుక్‌స్టాల్స్‌లో కొనండి. లేదా మీరు కోరిన పుస్తకాల ధరలో రూపాయి తగ్గించి M.O.చేయండి. ఆ మిగిలిన రూపాయికి V.P.P.లో పంపుతాము.

నవజ్యోతి పబ్లికేషన్స్
ఏలూరురోడ్, విజయవాడ-2